సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 25 । జూలై । 2023



నకిలీ విత్తనాలపై నజర్

నాసిరకం విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. 8లో▸



గంజాయి ముఠా గుట్టురట్టు

అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ఈ సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. 8లో▸



పోడు హక్కులు కల్పించండి

పోడు భూములపై హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పల్లెచెల్క తండా గిరిజనులు ఆందోళన చేపట్టారు. 8లో▸

న్యూస్‌రీల్

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి



కలెక్టరేట్‌లో లైబ్రరీని పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. అడిషనల్ కలెక్టర్ పేషీలో ఏర్పాటు చేసిన మినీ లైబ్రరీని సోమవారం గ్రంథాలయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 30 గ్రంథాలయాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటిలో గ్రేడ్-1,2,3 లైబ్రరీలు ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠకులకు చేరువయ్యేందుకు పౌర పట్టణ గ్రంథాలయాలు ప్రారంభించినట్టు చెప్పారు. మరో 30 లైబ్రరీల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు. కలెక్టరేట్‌కు వచ్చిన వారి కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. గ్రంథాలయ సేవలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రెటరీ మనోజ్‌కుమార్, లైబ్రేరియన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘ఓపెన్’లో డిగ్రీ ప్రవేశాలు

షాద్‌నగర్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023–24 విద్యాసంవత్సరంలో డిగ్రీ చేయాలనుకునేవారు ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఓపెన్ ఇంటర్, రెగ్యులర్ ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ అర్హతలు ఉన్న విద్యార్థులు అంబేడ్కర్ సార్వత్రిక డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీల్లో అడ్మిషన్లు తీసుకోవచ్చని సూచించారు. రెగ్యులర్‌గా కళాశాలకు వెళ్లేందుకు వీలుకాని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అప్లికేషన్, ఒరిజినల్ సర్టిఫికెట్లను స్టడీ సెంటర్‌లో చూపించి ఫీజు కట్టి ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్ పొందొచ్చన్నారు. వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆదిబట్లలో అడిషనల్ డీసీపీ కార్యాలయం



ఇబ్రహీంపట్నం రూరల్: మహేశ్వరం జోన్ అడిషనల్ డీసీపీ కార్యాలయం ఆదిబట్లలో ప్రారంభం కానుంది. ఇప్పటికే హోంశాఖ, డీజీపీ మహేశ్వరం జోన్‌కు అడిషనల్ డీసీపీగా బీవీ సత్యనారాయణను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మొదటగా నిర్మించిన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ డీసీపీ కార్యాలయం ఏర్పాటు కోసం రెండు రోజులుగా పనులు చకచకా సాగుతున్నాయి. రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో కార్యాలయం ప్రారంభం కానుంది.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా. సుంకె రాజేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఖాళీల వివరాలను ఈ నెల 25న కళాశాల నోటీస్ బోర్డుపై ప్రదర్శిస్తామన్నారు. 28న ఉదయం 10 గంటలకు విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జీరాక్స్ ప్రతులతో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందినవారు అదేరోజు రూ.6,200 ఫీజు చెల్లించాలన్నారు. పాలిసెట్ రాసిన, రాయనివారు సైతం ఈ నెల 25 నుంచి 27వ తేదీలోపు కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో బోధన కోసం లెక్చరర్లుగా ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ సూచించారు. తోల్‌కట్ట సమీపంలోని వికారాబాద్ డిగ్రీ మహిళా కళాశాలలో హిస్టరీ బోధన కోసం పార్ట్‌టైమ్ ప్రాతిపదికన పని చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని, ఈనెల 27వ తేదీ 4 గంటలలోపు డిగ్రీ కళాశాలలో బయోడేటా సమర్పించాలన్నారు. వివరాలకు 82470 68251 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అవకాడో.. అధరహో

జిల్లాలో అరుదైన పండ్లసాగు

- కిలో ధర రూ.200 పైమాటే
- కాసులు కురిపిస్తున్న విదేశీ పంట
- ఆదర్శంగా నిలుస్తున్న కందుకూరు రైతు జైపాల్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: స్వదేశీ పండ్ల సాగులోనే కాదు.. విదేశీ పండ్ల సాగుకు సైతం మన జిల్లా కేంద్ర బిందువుగా నిలుస్తోంది. ఇప్పటి వరకు గల్ఫ్ దేశాలకే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్స్, కర్జూర వంటి ఖరీదైన పంటలను పండించిన జిల్లా రైతులు తాజాగా ఒంట్లోని కొవ్వును వెన్నలా కరిగించడంతో పాటు అనారోగ్యం దరిచేరకుండా కాపాడే అరుదైన ‘అవకాడో’ పంటల సాగుతో ఆదర్శంగా నిలుస్తున్నారు. భౌగోళిక, వాతావరణ పరిస్థితులకు భిన్నంగా అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేసి చూపిస్తున్నారు.

బీటెక్ పూర్తి చేసి..

కందుకూరు మండలం దెబ్బగూడకు చెందిన రమావత్ జైపాల్ బీటెక్ పూర్తి చేశాడు. ఎంబీఏ కోసం పదేళ్ల క్రితం లండన్ వెళ్లాడు. అక్కడ సరైన ఉపాధి అవకాశాలు దొరక్కపోవడంతో అనాదిగా వస్తున్న వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకున్నాడు. విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఇతరులకు భిన్నంగా ఆలోచించాడు. అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంటను సాగు చేయాలని నిర్ణయించాడు. ఆ మేరకు జిల్లాలోనే తొలిసారిగా మూడేళ్ల క్రితం ప్రయోగాత్మకంగా 1.10 ఎకరాల పొలంలో 220 అవకాడో మొక్కలు నాటారు. ఒక్కో మొక్కకు రూ.370 వరకు ఖర్చు చేశాడు. మొక్క నాటే సమయంలో గుంతలో వేపపిండి, గులికల మందు వాడాడు. ఆ తర్వాత డ్రిప్ సాయంతో మొక్కలకు నీళ్లందించాడు. చీడపీడల సమస్యే కాదు పెట్టుబడికి పైసా ఖర్చు కూడా లేకపోవడం ఆ యువ రైతుకు కలిసి వచ్చింది. ప్రస్తుతం ఆ మొక్కలు ఏపుగా పెరిగి.. కాపునకు




అవకాడో పండ్ల సాగు

వచ్చాయి. సాధారణంగా 25 డిగ్రీల్లో మాత్రమే జీవించే ఈ మొక్క అనూహ్యంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలను కూడా తట్టుకుని ఏపుగా నిలబడింది. ఒక్కో చెట్టు నుంచి 150 నుంచి 200 కాయలు దిగుబడి వచ్చింది. ప్రస్తుతం ఈ పండుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. కేజీ ధర రూ.200పైగా పలుకుతూ ఆ రైతుకు కాసుల వర్షం కురిపిస్తోంది.

పిండిపదార్థాలు తక్కువ.. శక్తి ఎక్కువ

ప్రకృతి పసాదించిన అనేక రకాల పండ్లలో అతి బలమైన పండు అవకాడో. దీన్ని బట్టర్ ఫ్రూట్‌గా పిలుస్తారు. పండు లోపల వెన్నపూసలాగా మృదువుగా ఉంటుంది. నోట్లో పెట్టుకుంటే ఇట్టే కరిగిపోతుంది. వెన్న ఎంత బలమో ఈ అవకాడో పండు కూడా అంతే బలాన్ని ఇస్తుంది. నిజానికి పండ్లలో అన్నింటికంటే అరటిపండు అత్యధిక శక్తిని ఇస్తుందని చెబుతున్నారు. జాతీయ పోషకాహార సంస్థ సర్వే ప్రకారం.. వంద గ్రాముల మామిడి పండులో 74 కేలరీల శక్తి, పనస పండులో 88 కేలరీల శక్తి, సీతాఫలంలో 104 కేలరీల శక్తి, సపోటాలో 98 కేలరీల శక్తి, కర్జూరలో 144 కేలరీల శక్తిని ఇస్తుంది. అరటి పండులో 116 కేలరీల శక్తి లభిస్తుంది. అదే వంద గ్రాముల అవకాడో పండులో 215 కేలరీల శక్తి



లభిస్తుంది. అన్ని పండ్లలో ఫ్యాట్ ఎక్కువ కానీ అవకాడలో ఫ్యాట్ 23 గ్రాములే ఉంటుంది. ప్రొటీన్ కూడా 2 గ్రాములు, కార్బోహైడ్రేట్స్ ఒక గ్రాము(పిండి పదార్థాలు) మాత్రమే. ఫైబర్ మాత్రం కొంత ఎక్కువే(6.7 గ్రాములు) ఉంటుంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే లభిస్తుంది. చూసేందుకు ఆకుపచ్చరంగులో బత్తాయిపండు మాదిరి కన్పిస్తుంది. పండిన తర్వాత నల్లగా మారుతుంది. బహిరంగ మార్కెట్లో ఒక్కో (400– 500 గ్రాములు) పండు ఖరీదు రూ.వంద పైమాటే. కోసిన తర్వాత గింజను తీసివేసి..గుజ్జును మాత్రమే తినాలి.

రోగ నిరోధకశక్తిగా పని చేస్తుంది

రోజుకు ఒక అవకాడో పండును తీనడం ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. అధిక బరువును తగ్గించుకోవచ్చు. వాకింగ్, జాగింగ్‌తో పని లేకుండా ఇంట్లో కూర్చొనే ఒంట్లోని కొవ్వును కరిగించుకోవచ్చు. అంతేకాదు కంటి చూపును మెరుగుపరుస్తుంది. రక్త కేన్సర్ కారకాలను నిరోధిస్తుంది. మగవారిలో వెలుగు చూసే ప్రొస్టేట్ కేన్సర్ నివారిస్తుంది. మెదడు పని తీరును మెరుగుపరుస్తుంది. అంతేకాదు పురుషుల్లో లైంగిక సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా సహజ వయాగ్రలా ఇది పని చేస్తుంది. గర్భిణులు, బాలింతలు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలు, వృద్ధులకు ఈ పండును తినిపించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చొచ్చు.

వ్యవసాయంపై ఆసక్తితో..



మాది మొదటి నుంచి వ్యవసాయ ఆధారిత కుటుంబం. నాకు వ్యవసాయం అంటే ఆసక్తి ఎక్కువ. ఏదో ఒక పండ్లతోటను సాగు చేయాలని మొక్కల కొనుగోలు కోసం జడ్చర్ల నర్సరీకి వెళ్లాను. అక్కడ అవకాడో మొక్కలు చూశాను. అప్పటికే ఆ పండు గురించి తెలుసు కాబట్టి..ఆ పంటను సాగుచేయాలనుకున్నా. చీడపీడల సమస్య లేదు. కేవలం మొక్కల కొనుగోలు, గుంతలు, డ్రిప్ ఏర్పాటు కోసం మాత్రమే ఖర్చు చేశాను. మొక్క నాటిన తర్వాత పైసా ఖర్చు చేయలేదు. ప్రస్తుతం పంట దిగుబడి ఆశించిన దానికంటే ఎక్కువగా వచ్చింది. చాలా మంది ఆన్‌లైన్‌లో చూసి, స్వయంగా తోట వద్దకే వచ్చి పండ్లను కొనుగోలు చేస్తున్నారు. కిలో రూ.200పైగా పలుకుతోంది.

– జైపాల్, యువరైతు

కో ఆపరేటివ్ సొసైటీతో మేలు

జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి జయప్రసాద్

షాద్‌నగర్‌రూరల్: నూతనంగా ఏర్పాటు చేసిన ది అడ్వకేట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీతో న్యాయవాదులకు ఎంతో మేలు చేకూరుతుందని జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి జయప్రసాద్ అన్నారు. పట్టణంలోని కోర్టు సముదాయంలో సోమవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో నూతనంగా ది అడ్వకేట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ బ్రాంచ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి జయప్రసాద్ మాట్లాడుతూ.. న్యాయవాదుల బాగోగులకోసం అన్ని విధాలా సహకరించేందుకు ఈ సొసైటీ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కో ఆపరేటివ్ సొసైటీ సేవలను న్యాయవాదులు సకాలంలో వినియోగించుకోవాలని సూచించారు. సొసైటీ ఏర్పాటు ఎంతో మంచి అవకాశమని, న్యాయవాదులకు కో ఆపరేటివ్ సొసైటీ అండగా నిలుస్తుందన్నారు. అనంతరం సెషన్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. కో ఆపరేటివ్ సొసైటీతో న్యాయవాదులకు అన్ని విధాలా లాభం జరుగుతుందని అన్నారు. న్యాయవాదులు చిత్తశుద్ధితో అందిస్తున్న సేవలను కొనియాడారు.



కో ఆపరేటివ్ సొసైటీని ప్రారంభిస్తున్న జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి జయప్రసాద్

కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సూరజ్‌సింగ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్‌కుమార్, కో ఆపరేటివ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, న్యాయవాదులు రాజగోపాల్, చెంది మహేందర్‌రెడ్డి, గండుబావి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, అంజయ్యయాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, సబియాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు పాటుపడండి

- కార్యకర్తలకు ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్ పిలుపు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇటు రాష్ట్రంలోనూ, అటు దేశంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని ఏఐసీసీ కార్యదర్శి మన్సూర్ అలీఖాన్ అన్నారు. ఇప్పటి వరకు జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరించిన బోసరాజు స్థానంలో కొత్తగా మన్సూర్ అలీఖాన్ నియమితులైన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం తొలిసారిగా ఆయన గాంధీభవన్‌కు చేరుకున్నారు. జిల్లా ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే వంద రోజులు మరింత కష్టపడి పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. జిల్లా, మండల, బూత్ స్థాయి కమిటీలు మరింత కష్టపడాలన్నారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, అధికారప్రతినిధి సుధీర్‌రెడ్డి, గౌరిసతీష్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, జ్యోత్స్నరెడ్డి, విజయారెడ్డి, వీర్లపల్లి శంకర్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పారిజాత, సిద్దాల శ్రీశైలం, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాచమల్ల సిద్ధేశ్వర్, భీమ్ భరత్, అమరేందర్‌రెడ్డి, గజ్జి భాస్కర్, దండెం రామి రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, జయమ్మ, వసంతం, దర్శన్, చింపుల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మన్సూర్ అలీఖాన్

పత్రీజీ సేవలు చిరస్మరణీయం

కడ్తాల్: ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ ధ్యాన జగత్తు కోసం చేసిన సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద ది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో పత్రీజీ సంస్మరణోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ధ్యానంతో శాంతియుత సమాజాన్ని నిర్మించవచ్చని, పత్రీజీ సృష్టించిన ధ్యాన సంకల్పం ఎంతో విశిష్టమైందని పేర్కొన్నారు. శాఖాహార సమాజ స్థాపనకు, ధ్యాన జగత్తు కోసం ప్రపంచ వ్యాప్తంగా 50 వేల పిరమిడ్‌లు నిర్మించి, ఎంతో మందికి ధ్యానం నేర్పిన గొప్ప గురువు అని కొనియాడారు. పత్రీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు పత్రీజీతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.



పత్రీజీ శక్తిస్థల్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

అంతకు ముందు ఎమ్మెల్యేతో పాటు, ప్రజా ప్రతినిధులు, ధ్యానులు పత్రీజీ శక్తిస్థల్‌ను సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, నాయకులు గోపాల్, భూపతిరెడ్డి, వినోద్, మాధవి, పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు, ధ్యానులు పాల్గొన్నారు.

కేటీఆర్ యూత్ ఐకాన్

- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మంత్రి జన్మదినం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేటీఆర్ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏ రాష్ట్రాల్లో లేనటువంటి దిగ్గజ కంపెనీలు, భారీ పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొచ్చి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని అన్నారు. కేటీఆర్ యూత్ ఐకాన్‌గా నిలుస్తారన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునితా నాయక్, మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వర్ణగంటి ఆనందం, జిల్లా రైతు కమిటీ సభ్యుడు కూన యాదయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వి.మల్లేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, ఎంపీటీసీ కుమారి రాయప్ప పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తదితరుల

మహేశ్వరంలో వేడుకలు.

మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతోకలిసి జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా రైతు కమిటీ సభ్యుడు కూనయాదయ్య, బీఆర్ఎస్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వి.మల్లేశ్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులం..సమస్యలమయం

- 100 మందికోసం నిర్మించిన హాస్టల్ భవనం
- కొనసాగుతున్న 600 మంది విద్యార్థినులు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ
- కిటికీలకు అద్దాలు లేక వానకు, చలికి వణుకు
- స్నానాలకు సరిపడా నీళ్లు కరువు
- మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకులం దీనస్థితి

మొయినాబాద్: స్నానాలు చేసేందుకు నీళ్లు సరిగా లేక.. కిటికీలకు అద్దాలు లేక.. హాస్టల్ భవనం పక్కనే మురుగు గుంత.. పక్కనే చెత్తా చెదారం.. వెదజల్లే దుర్వాసన.. తరగతి గదుల్లో నిద్ర.. ఇలా మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల పాఠశాలను సమస్యలు వెంటాడుతున్నాయి.తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం గురుకుల పాఠశాలలను విస్తరించింది. ప్రతి నియోజకవర్గంలో ఎస్సీ, బీసీ, మైనార్టీల గురుకులాలను ఏర్పాటు చేసింది. బాలురు, బాలికలకు విడివిడిగా ప్రారంభించారు. ఇందులో భాగంగా శంకర్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల 2018లో మొదలైంది. శంకర్‌పల్లిలో నిర్వహించేందుకు అనువైన భవనాలు దొరక్కపోవడంతో మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం వెనకాల ఉన్న భవనంలో కొనసాగిస్తున్నారు.

100 మందికోసం నిర్మించిన భవనంలో 600 మంది

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో 2013లో అప్పటి ప్రభుత్వం కళాశాల విద్యార్థినులకోసం భవనాన్ని నిర్మించింది. 100 మంది విద్యార్థినులకు వసతి కల్పించేలా నిర్మాణం చేపట్టింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కళాశాల విద్యార్థినులకు వసతి కల్పించకుండా వదిలేశారు. గురుకులాలు మొదలయ్యాక శంకర్‌పల్లి గురుకుల బాలికల పాఠశాలను ఈ భవనంలో నిర్వహిస్తున్నారు. 100 మంది సామర్థ్యంతో నిర్మించిన ఈ భవనంలో ప్రస్తుతం 600 మంది విద్యార్థినులు ఉన్నారు.

ఒకే గదిలో తరగతుల నిర్వహణ, డార్మెటరీ

భవనంలో విద్యార్థులకు సరిపడా గదులు అందుబాటులో లేవు. ఒక క్లాస్‌కు ఒకే గదిలో డార్మెటరీ, తరగతుల నిర్వహణ చేపడుతున్నారు. ఒక్కో గదిలో సుమారు 40–60 మంది విద్యార్థినులు ఉంటున్నారు. వారికి ఆ గదులు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 600 మంది విద్యార్థినులకు 50 బాత్‌రూంలు మాత్రమే ఉన్నాయి. అందులో కొన్ని నల్లాలు పనిచేయడంలేదు. గురుకులంలోనే కళాశాల ఉండటంతో భవనంపై రేకుల గదులు నిర్మించారు. రెండేళ్లలోనే ఆ గదుల గోడలకు పగుళ్లు వచ్చాయి. వర్షం పడితే ఉరుస్తున్నాయి. కిటికీల అద్దాలు పగిలిపోయి వర్షం వచ్చినప్పుడు నీళ్లు వస్తున్నాయి. కొన్ని కిటికీలకు విద్యార్థులు అట్టముక్కలు, దుస్తులు అడ్డుపెట్టారు.

భవనం పక్కనే మురుగు, చెత్తాచెదారం

గురుకుల హాస్టల్ భవనం పక్కనే పెద్ద మురుగు గుంత ఏర్పడింది. హాస్టల్ బాత్‌రూంలలోని నీరంతా అందులోకి చేరుతోంది. దాని పక్కనే చెత్త వేస్తున్నారు. హాస్టల్‌లోని వ్యర్థాలన్నీ మురుగు గుంత పక్కనే వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు చేరి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. మరోవైపు సరిపడా నీళ్లు రావడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు వారంలో రెండు మూడు రోజులు మాత్రమే వస్తున్నాయి. హాస్టల్‌కు ఓ బోరు ఉన్నా దాని ద్వారా వచ్చే నీళ్లు సరిపోక స్నానాలు, బట్టలు ఉతకడానికి ఇబ్బందులు పడుతున్నారు.



హాస్టల్ భవనం పక్కనే మురుగు గుంత, చెత్తా చెదారం



కిటికీలకు అద్దాలు లేక దుస్తులు, అట్టముక్కలు అడ్డు పెట్టిన దృశ్యం

మూడు రోజులు క్రితం షార్ట్ సర్క్యూట్

గురుకుల హాస్టల్ భవనంలో మూడు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో మీటర్ కాలిపోయి పెద్ద శబ్దం, మంటలు వచ్చాయి. విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు అధికారులు, ప్రిన్సిపాల్‌ను నిలదీస్తున్నారు.

దుర్వాసన వస్తోంది



హాస్టల్ భవనం పక్కనే పెద్ద మురుగు గుంత ఉంది. అక్కడే చెత్తా చెదారం, వ్యర్థాలు వేస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. దుర్వాసన భరించలేకపోతున్నాం. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రావడంతో చాలా భయపడ్డాం.

– సంజన, విద్యార్థిని

సమస్యలన్నీ పరిష్కరిస్తాం



హాస్టల్‌లో చిన్నచిన్న సమస్యలు ఉన్నాయి. మురుగు నీరు వెళ్లేందుకు కాలువ లేక గుంతలో నిలుస్తున్నాయి. చెత్త ప్రతి రోజు తొలగించాలని పంచాయతీ సిబ్బందికి చెబుతున్నాం. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరిష్కరిస్తాం.

– జయమ్మ, ప్రిన్సిపాల్

సమస్యల పరిష్కారానికే ‘పల్లెబాట’


గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్‌: గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడమే పల్లెబాట కార్యక్రమ లక్ష్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ అన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పల్లెలు అభివృద్ధి చెందినప్పుడే దేశం ప్రగతి సాధిస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్‌, ఎంపీటీసీ సభ్యుల సంఘం మండల అధ్యక్షుడు భీష్మ రామకృష్ణ, బీఆర్‌ఎస్‌ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య, నాయకులు పోచయ్యగౌడ్‌, జనార్దన్‌గౌడ్‌, అశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కుమార్‌, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై వీధి కుక్కల దాడి

మంచాల: గొర్రెల మందపై వీధి కుక్కల దాడి చేయడంతో ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని తాళ్లపల్లిగూడలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గొర్రెల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్న పాక యాదయ్యకు చెందిన ఎనిమిది జీవాలు మృత్యువాత పడడంతో బోరున విలపించాడు. బాధితుడికి రూ.లక్ష నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే ఆదుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు ఐలయ్య గొర్రెల కాపరులు, డిమాండ్‌ చేశారు.

నిబంధనలను పాటించకుంటే జైలు

శంషాబాద్‌: ట్రాఫిక్‌ ఉల్లంఘనలకు పాల్పడిన 38 మందిని ఆర్‌జీఐఏ ట్రాఫిక్‌ పోలీసులు రాజేంద్రనగర్‌ మెట్రోపాలిటన్‌ కోర్టులో సోమవారం హాజరుపర్చారు. న్యాయమూర్తి వీరిలో 11 మందికి కనిష్టంగా ఒకరోజు, గరిష్టంగా ఐదు రోజుల జైలు శిక్షను విధించారు. మిగిలిన వారికి సైతం జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని లేదంటే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్‌: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన రాయికల్‌ టోల్‌ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్‌ తెలిపిన ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(40) మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో కొంత కాలంగా రాయికల్‌ టోల్‌ప్లాజా సమీపంలో తిరుగుతున్నాడు. జాతీయ రహదారి ప్రక్కన ఉండే హోటల్స్‌లో ఆహారాన్ని అడుక్కుని తింటూ ప్రక్కనే ఉన్న బస్టాప్‌లో ఉండేవాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఏఎస్‌ఐ వెంకటేశ్‌ ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుడికి వివరాలు తెలియకపోవడంతో శవాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కండక్టర్‌ బలవన్మరణం


ప్రభాకర్‌ (ఫైల్‌)

చేవెళ్ల: అనారోగ్య సమస్యలు భరించ లేక ఓ ఆర్టీసీ కండక్టర్‌ పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఆలూరులో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి ప్రభాకర్‌(39) ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కొన్ని రోజులుగా కడుపునొప్పి తదితర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగానికి కూడా వెళ్లడం లేదు. ఆయన భార్య నవనీత తన పిల్లలతో సహా పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నెల 23న ప్రభాకర్‌ భార్యాపిల్లలను చూసి మధ్యాహ్నం స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం ఉదయం పురుగు మందు సేవించి వచ్చి ఇంటి ఎదుట పడిపోవడంతో స్థానికులు గమనించి చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ విత్తనాలపై నజర్‌

ప్రభుత్వం నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకుంటోంది. నాసిరకం విత్తనాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు వ్యవసాయ, పోలీస్‌ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందాల అధికారులు, వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతూ కేసులు నమోదు చేస్తున్నారు.

- నాసిరకం పురుగు మందులపై నిఘా
- అనుమతిలేని వ్యాపారులపై స్పెషల్‌ ఫోకస్‌
- జిల్లా వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్‌ బృందం విస్తృత తనిఖీలు



షాబాద్‌: జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగుల మందు కట్టడికి జిల్లా వ్యవసాయ, పోలీసుశాఖలు అప్రమత్తమయ్యాయి. వానాకాలం సాగు పనులు ఆరంభమవుతున్న నేపథ్యంలో కొందరు రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోళ్లు చేస్తున్నారు. వారికి నాణ్యమైనవి అందేలా అధికార యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టింది. ప్రైవేట్‌ దుకాణాలు, సింగిల్‌విండోలు, డీసీఎంఎస్‌లు, ఆగ్రోస్‌ పరిధిలోని ప్రతీ దుకాణంలో తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో 2800 పురుగు మందులు, 3,956 రసాయనిక ఎరువుల దుకాణాలు ఉన్నాయి. వీటి నిర్వహణకు జిల్లా వ్యవసాయ శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

జాగ్రత్తలు

- లైసెన్స్‌ ఉన్న ఎరువుల దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు సమయంలో తీసుకునే బిల్లులు పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చాలి.
- బిల్లు ఇవ్వకుంటే ఏఈఓ, మండల వ్యవసాయాధికారికి ఫోన్‌లో ఫిర్యాదు చేయాలి.
- దుకాణాదారు లైసెన్స్‌లో సూచించిన బిల్లు లేదా గోదాములోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నిల్వచేయాలి.
- నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్న వ్యాపారులపై సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికే 420 సెక్షన్‌ కింద కేసులు నమోదు చేస్తున్నారు.
- ప్యాక్‌ చేయకుండా, తెల్లసంచుల్లో విత్తనాలు విక్రయిస్తే పోలీసులు పీడీ యాక్ట్‌ నమోదు చేస్తున్నారు.
- పత్తి, మిర్చిసాగు చేసే రైతులు కచ్చితంగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

టాస్క్‌ఫోర్స్‌ బృందం ఆకస్మిక తనిఖీలు

ఈ వానాకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, రసాయన ఎరువులు అందించేందుకు టాస్క్‌ఫోర్స్‌ ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో మండల వ్యవసాయాధికారి, ఎస్సైలతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌ జిల్లా వ్యవసాయాధికారితో పాటు, ఎస్పీ పర్యవేక్షణలో నిఘా బృందాలు పర్యటిస్తున్నాయి. ఫిర్యాదులు అందిన వెంటనే టాస్క్‌ఫోర్స్‌ ఆకస్మికంగా తనిఖీలు చేస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి



విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వీటి కొనుగోలు సమయంలో దుకాణ యజమాని నుంచి కచ్చితంగా బిల్లు తీసుకోవాలి. దానిపై లాట్‌ నంబరు, కాలపరిమితి ఉందా లేదా అని చెక్‌ చేసుకోవాలి.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు

- ఇద్దరు నిందితులకు రిమాండ్‌
- పరారీలో సరఫరా చేసే వ్యక్తి

ఇబ్రహీంపట్నం రూరల్‌: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ఈ సంఘటన ఆదిబట్ల పీఎస్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రవికుమార్‌ తెలిపిన ప్రకారం.. బీహార్‌ రాష్ట్రం సాహేగుంజ్‌ జిల్లా బడ్కోరి గ్రామానికి చెందిన మహమ్మద్‌ మిరాజ్‌ అన్సారీ(27) కొన్నేళ్లుగా ఆదిబట్ల బీరప్ప ఆలయ సమీపంలో రాఘవేంద్ర ఇటుక బట్టీ పరిశ్రమలో కూలీగా పనిచేస్తున్నాడు. ఆయన రెండు నెలల క్రితం బీహార్‌ నుంచి 8 కేజీల గంజాయి తీసుకువచ్చి సేవిస్తూ.. మరో మైనర్‌తో కలిసి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్‌ ఎస్‌ఓటీ పోలీసులు, ఆదిబట్ల పోలీసులు ఆదివారం రాత్రి ఇటుక బట్టీపై దాడి చేసి నిందితుల వద్ద 7కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.5లక్షలు ఉంటుందన్నారు. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి రూ.300 చొప్పున విక్రయిస్తూ వీరు సొమ్ము చేసుకుంటున్నారు. వీరికి బీహార్‌ నుంచి గంజాయి సరఫరా చేస్తున్న బినయ్‌ పరారీలో ఉండగా మిరాజ్‌ అన్సారీ, మైనర్‌ను అరెస్ట్‌ చేసిన రిమాండ్‌కు తరలించారు. అనంతరం బాలుడిని జువైనల్‌ హోంకు అప్పగించారు.


నిందితుడు మిరాజ్‌ అన్సారీ, పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

పవర్‌ ‘కట్‌’కట!

- తుర్కయంజాల్‌లో కాలిపోయిన పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌
- వారం రోజులుగా పట్టించుకోని విద్యుత్‌ శాఖ అధికారులు
- అవస్థలు పడుతున్న వినియోగదారులు


కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తున్న సిబ్బంది

తుర్కయంజాల్‌: తుర్కయంజాల్‌ సబ్‌ స్టేషన్‌లో పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ కాలిపోయి వారం రోజులు గడుస్తున్నా.. బాగు చేయించడంలో విద్యుత్‌ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సరఫరాలో అంతరాయం కలిగితే గంటల వ్యవధిలోనే పరిష్కారం చూ పాల్సి ఉండగా.. కాలయాపన చేయడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా, గాలి వీచినా గంటల తరబడి కరెంటు నిలిపేస్తున్నారు. నగరానికి కూతవేటు దూరంలో ఉండి, నిర్మాణ రంగం శరవేగంగా ముందుకు సాగుతున్న ప్రాంతంలో విద్యుత్‌ సమస్యలు తలెత్తడం ఇబ్బందికరంగా మారుతోంది. కరెంటు సరఫరా ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో..? తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు.

ఫిర్యాదు చేసినా..

విద్యుత్‌ సమస్యలపై ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఏఈఈ శ్రీనివాస్‌రెడ్డి పాటు సబ్‌ స్టేషన్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు నంబర్‌ 9493193132కు ఫోన్‌ చేస్తే లిఫ్ట్‌ చేయడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల తీరుపై ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు కోతలు లేకుండా విద్యుత్‌ సరఫరా చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

కొత్తది ఏర్పాటు చేస్తాం

వారం రోజుల క్రితం పవర్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ కాలిపోయిన విషయం వాస్తవమే. సోమవారం దీన్ని తొలగించాం. ఈ స్థానంలో మంగళవారం మరో ట్రాన్స్‌ఫార్మర్‌ బిగిస్తాం. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కరెంటు సరఫరా చేస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఈ

చికిత్స పొందుతున్న కార్మికుడి మృతి

పరిశ్రమ పేలుడు ఘటనలో మూడుకు చేరిన మృతుల సంఖ్య

షాద్‌నగర్‌రూరల్‌: పరిశ్రమ పేలుడు ఘటనలో చికిత్స పొందుతున్న వారిలో సోమవారం మరో కార్మికుడు మృతి చెందినట్లు ఏఎస్‌ఐ రాంచందర్‌ తెలిపారు. ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ శివారులోగల బ్లెండ్‌ కలర్‌(ప్యాకేజీ కవర్ల పరిశ్రమ)లో ఈ నెల 16న రాత్రి భారీ పేలుడు సంభవించిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న 11 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం క్షతగాత్రులందరిని నగరంలోని డీఆర్‌డీఓ అపోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సునీల్‌(55) ఈనెల 22న మృతి చెందగా శరత్‌శివాజీ(28) 23న, ప్రత్యూమ్న(35) సోమవారం మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏఎస్‌ఐ రాంచందర్‌ తెలిపారు.

బావమరిదిని చంపిన బావకు జీవిత ఖైదు

రూ.500 జరిమానా


నిందితుడు విశ్వప్రదాన్‌

ఇబ్రహీంపట్నం రూరల్‌: బావమరిదిని చంపిన బావకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా కోర్టు తీర్పు వెల్లడించింది. ఆదిబట్ల సీఐ రవికుమార్‌ తెలిపిన ప్రకారం.. ఒడిసా రాష్ట్రం బానర్‌ డివిజన్‌ కలహండి జిల్లాకు చెందిన సంజుక్త మాఝీ, ఆమె భర్త విశ్వప్రదాన్‌ మన్నెగూడ సమీపంలోని హరీస్‌ ప్రణవ్‌ విల్లాస్‌లో కాంట్రాక్టర్‌ ప్రభాకర్‌రెడ్డి వద్ద సెంట్రింగ్‌ పనిచేస్తూ జీవనం సాగించేవారు. వారితో పాటు సంజుక్త మాఝీ సోదరుడు బానామాఝీ అదే కాంట్రాక్టర్‌ వద్దే పనిచేసేవాడు. విశ్వప్రదాన్‌ నిత్యం మద్యం సేవించి సంజుక్త మాఝీతో గొడవపడేవాడు. 2021 అక్టోబర్‌ 11న దంపతులు ఇద్దరు గొడవపడుతుండగా పక్కగదివారు గమనించి బానామాఝీ చెప్పడంతో అక్కడి చేరకుని బావను నిలదీశాడు. దీంతో కక్ష పెంచుకున్న విశ్వప్రదాన్‌ రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో బావమరిది తలపై బండరాయి వేశాడు. దీంతో తీవ్రరక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మాకుటుంబ విషయంలో జోక్యం చేసుకున్నందునే హతమార్చినట్లు ఒప్పుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సోమవారం ఎల్బీనగర్‌ అడిషనల్‌ డిస్ట్రిక్ట్‌ జడ్జి(ఏడీజే) నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పువెల్లడించారు. విశ్వప్రదాన్‌ ఇప్పటికే చర్లపల్లి జైలులో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

అడిషనల్‌ కలెక్టర్‌ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్‌: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అడిషనల్‌ కలెక్టర్‌ భూపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అడిషనల్‌ కలెక్టర్‌ మాట్లాడుతూ ఆయా శాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆయా సమస్యలపై 348 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ భూపాల్‌రెడ్డి

పోడు హక్కులు కల్పించండి


జాతీయ రహదారిపై బైఠాయించిన పల్లెచెల్కతండా వాసులు

- పల్లెచెల్కతండా గిరిజనుల ఆందోళన
- తహసీల్దార్‌, జెడ్పీటీసీ సభ్యులకు వినతిపత్రాల అందజేత

కడ్తాల్‌: వందల ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములను హక్కులు కల్పించాలని డిమాండ్‌ చేస్తూ పల్లెచెల్కతండా గిరిజనులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్‌ వినోద్‌కుమార్‌, జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌ నాయక్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ మేరకు సోమవారం వారు మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్‌ రహదారిపై ర్యాలీ చేపట్టి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాకు చెందిన 300 కుటుంబాల వారు మూడు తరాలుగా తండా సమీపంలో 1100 ఎకరాల అటవీ మాసుర భూమిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని సాగు చేస్తున్నామన్నారు. ఇటీవల అటవీ శాఖ అధికారులు ఇళ్లను ఏర్పాటు చేసుకోకుండా.. సాగును సైతం అడ్డుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను సైతం నిర్మించకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూములపై హక్కులు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తమ భూములకు కల్పించా లని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో సర్పంచ్‌ లోకేశ్‌నాయక్‌, నాయకులు నవీన్‌, బీచ్యానాయక్‌, శ్రీను, మధు,శ్రీను, బాలునాయక్‌, భీమ్లానాయక్‌, మోతీలాల్‌, బాలు, దశరథ, పెద్ద ఎత్తున గిరిజనలు, తండా వాసులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కేశంపేట: జీపీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి కోరారు. మండల కేంద్రంలో 19వ రోజు పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్‌ విధానాన్ని రద్దు చేసి కార్మికులుగా గుర్తించాలని, పీఎఫ్‌, ఈఎస్‌ఐ సౌకర్యంతో పాటు పనికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్‌ చేశారు. పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ చెయించుకొని సరైన వేతనాలు అందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, రవి, పారేష, రోశయ్య, పద్మమ్మ, రాములమ్మ, నర్సమ్మ, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నర్సింహారెడ్డి